## ఆలయాల్లో తాత్కాలిక ఉద్యోగుల సేవలు!

- విధివిధానాల కోసం కమిటీ ఏర్పాటు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): దేవాలయాల్లో పనిభారం పెరగడం, అందుకు తగ్గట్టుగా ఉద్యోగ నియామకాలు లేకపోవడంతో తాత్కాలిక పద్ధతిలో ఉద్యోగుల నియామకాలకు దేవాదాయ శాఖ సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించిన విధివిధానాల రూపకల్పనపై ఆ శాఖ ముగ్గురు అధికారులతో కమిటీని ఏర్పాటుచేసింది. ఏడీసీలు కృష్ణవేణి, శ్రీనివాసరావు, హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ కృష్ణప్రసాద్ సభ్యులుగా ఉన్న ఈ కమిటీ.. గురువారం బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కార్యాలయం ధార్మికభవన్‌లో అర్చక, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమైంది. అర్చక, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు గంగు ఉపేంద్రశర్మ, కాండూరి కృష్ణమాచార్య, డీవీఆర్ శర్మ, మారుతి సత్యనారాయణశర్మ, చంద్రశేఖరశర్మ, పరాశరం రవీంద్రాచారి, తనుగుల అనిల్‌కుమార్ తదితరులు సమావేశానికి హాజరై కమిటీకి తమ అభిప్రాయాలు తెలియజేశారు. దేవాలయాల్లో అర్చకులను, పరిచారకులను నియమించే క్రమంలో వారికి రూ.20వేల వేతనం ఇవ్వాలని, భవిష్యత్‌లో శాశ్వత ఉద్యోగ నియామకాలు చేపట్టే సమయంలో వీరికి ప్రాధాన్యం ఇవ్వాలని సంఘాల ప్రతినిధులు సూచించారు. తాత్కాలిక నియామకాలు చేపట్టినా వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. దేవాదాయ శాఖ అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకొని, అర్చక సంఘాల అభిప్రాయాలను కూడా జోడించి సమగ్ర నివేదికను దేవాదాయ శాఖ కమిషనర్‌కు అందజేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

## బడుల్లో వనమహోత్సవం

- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో జూన్ 26 వరకు వనమహోత్సవాన్ని నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పెద్ద ఎత్తున పండ్లు, పూల మొక్కలను నాటాలని సూచించారు.

## 30వరకు స్కాలర్‌షిప్ గడువు

హైదరాబాద్, మే29 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ (2024-25) దరఖాస్తులకు జూన్ 30 వరకు గడువును పొడిగిస్తున్నట్టు ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ శ్రీధర్ గురువారం ఆదేశాలు జారీచేశారు. ఈ విషయాన్ని కళాశాలల యాజమాన్యాలకు, విద్యార్థులకు తెలపాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.



అమెరికాలోని డాలస్‌లో బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ కోసం గురువారం జరిగిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న నిర్వాహకులు



అమెరికాలోని డాలస్‌లో బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల కోసం గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు, ఎన్‌ఆర్‌ఐలు

# అమెరికాలో తెలం'గానం'



అమెరికాలోని వర్జీనియాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకల సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎన్‌ఆర్‌ఐలతో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

- బీఆర్‌ఎస్ రజతోత్సవాలపై విస్తృత చర్చ
- సన్నాహక సమావేశాలతో హోరెత్తిస్తున్న గులాబీలు
- ఉద్యమకాలం నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటున్న ఎన్నారైలు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని దాదాపు అన్ని ప్రధాన నగరాల్లో ఎక్కడ చూసినా తెలం'గానం' వినిపిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం, బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవాలు ఏకకాలంలో జరిగే అరుదైన దృశ్యం కోసం యూఎస్‌ఏ వ్యాప్తంగా ఉన్న తెలంగాణబిడ్డలు ఎదురుచూస్తున్నారు. డాలస్‌లోని డాక్టర్ పెప్పర్ ఎరినా వేదిక మీద జూన్ 1వ తేదీ (భారత కాలమానం ప్రకారం జూన్ 2- తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం)న అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించేందుకు యూఎస్‌లోని బిడ్డలు సమాయత్తమవుతున్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డాలస్ సభకు ముఖ్య అతిథిగా హాజరవుతారు. అయితే, లండన్‌లో ప్రాగ్మాటిక్ డిజైన్ సొల్యూషన్ లిమిటెడ్ (పీడీఎస్‌ఎల్) సంస్థ నిర్వహించే సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కేటీఆర్‌ను ఆహ్వానం అందిన నేపథ్యంలో ఇప్పటికే ఆయన లండన్ చేరుకున్నారు. లండన్ పర్యటన ముగిసిన అనంతరం ఆయన అక్కడి నుంచి అమెరికా వెళ్లనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. డాలస్ సభ నేపథ్యంలో వారం, పది రోజులుగా యూఎస్‌ఏలోని న్యూజెర్సీ, డేలావేర్, హూస్టన్, టెక్సాస్, కొలంబస్, ఆస్టిన్, ఫ్లోరిడా, శాన్‌ఫ్రాన్సిస్కో, లాస్‌ఏంజెల్స్, అష్బుర్మ్ తదితర నగరాల్లో నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో తెలంగాణ బిడ్డల నుంచి విశేష స్పందన లభించింది. యూఎస్‌ఏలోని అన్ని రాష్ట్రాల్లో ఉన్న తెలుగువారంతా అమితాసక్తిని చూపిస్తున్నారు. డాలస్ సభకు తాము సైతం హాజరవుతామని రాయలసీమ ప్రాంతానికి చెందిన ఎన్నారైలు, తానా, ఆటా సంస్థల్లోని ప్రతినిధులు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

### అమెరికాలో మళ్లీ ఉద్యమకాలం నాటి వాతావరణం

యూఎస్‌ఏలోని పలు రాష్ట్రాలు, నగరాల్లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమాలు జరిగిన సందర్భాలను తలపిస్తున్నాయి. బీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీ అధినేత కేసీఆర్‌తో మమేకమై, ఆయన ఇచ్చే పిలుపునకు అనుగుణంగా ఎన్నారైలు కార్యరంగంలోకి దిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పార్టీ ఆవిర్భావానికి కన్నా ముందు తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టీడీఎఫ్) తెలంగాణ ప్రాంత అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఆ తరువాత కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ ఆవిర్భావం తరువాత తెలంగాణ రాష్ట్రం కోసం ఎన్నారైలు ఉద్యమించారు. 2001 నుంచి 2014లో స్వరాష్ట్ర స్వప్నం నెరవేరే వరకూ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ వ్యాప్తంగా జరిగిన ఉద్యమం, ఆ ఉద్యమ కీలక సందర్భాల్లో ప్రవాసంలో ఉన్న తెలంగాణబిడ్డలు తమతమ ప్రాంతాలకు వచ్చి ఇక్కడ కార్యక్రమాలు నిర్వహించిన సందర్భాలను డాలస్ సభ నేపథ్యంలో ఎన్నారైలు గుర్తుచేసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ పురోభివృద్ధికి పడిన అడుగులు, పదేండ్లలో తెలంగాణ సాధించిన ప్రగతిని ఎన్నారైలు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం తెలంగాణలో కొనసాగుతున్న కాంగ్రెస్ పాలన ఉమ్మడి రాష్ట్రం నాటి దుస్థితిని తలపిస్తున్నదని ఎన్నారైలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### బీఆర్‌ఎస్ ఎన్నారై సెల్‌కు గులాబీ నేతల అండ

డాలస్ సభను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ నేతలకు పార్టీ నేతలు అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నారు. పార్టీ ముఖ్యనేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతోపాటు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు ఇప్పటికే అమెరికాకు చేరుకున్నారు. సన్నాహక సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. మరోవైపు డాలస్ సభ వేదిక మీద సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించేందుకు ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సహా నేతలు, కళాకారులు అమెరికాకు పయనమయ్యారు. డాలస్‌లోని డాక్టర్ పెప్పర్ ఎరినా వేదికగా బతుకమ్మ, బోనాలు తదితర తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే కార్యక్రమాలను నిర్వహించేందుకు యూఎస్‌లో ఉంటున్న తెలంగాణబిడ్డలు సన్నద్ధమవుతున్నారు.

### ఇంటిపండుగలా చేస్తాం: తెలంగాణ ఎన్నారైలు

బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవాలను ఇంటిపండుగలా విజయవంతం చేస్తామని డాలస్‌లోని తెలంగాణ ఎన్నారైలు ప్రకటించారు. జూన్ 1న డాక్టర్ పెప్పర్ ఎరినాలో జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు, బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవాల నేపథ్యంలో గురువారం డాలస్‌లో పలు తెలుగు ఎన్నారై సంస్థల ప్రతినిధులతో సన్నాహక సమావేశం జరిగింది. సమావేశానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, బీఆర్‌ఎస్ ఎన్నారై గ్లోబల్ కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల, బీఆర్‌ఎస్ యూఎస్‌ఏ అడ్వైజరీ బోర్డు చైర్మన్ మహేశ్ తన్నీరు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో 25 ఏండ్లు మనుగడ సాగించిన పార్టీల్లో బీఆర్‌ఎస్ ఒకటని చెప్పారు. ఏప్రిల్ 27న ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను అట్టహాసంగా నిర్వహించుకున్నామని, ఇదే స్ఫూర్తితో డాలస్‌లో సభ జరుగుతున్నదని పేర్కొన్నారు. మహేశ్ బిగాల మాట్లాడుతూ.. డాలస్‌లోని అన్ని తెలుగు సంస్థలకు చెందిన ప్రముఖులందరూ సన్నాహక సమావేశానికి రావడం ఎంతో సంతోషంగా ఉన్నదని చెప్పారు. జూన్ 1న డాలస్‌లో జరిగే సభకు అమెరికాలో ఉన్న తెలంగాణ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. బీఆర్‌ఎస్ యూఎస్‌ఏ అడ్వైజరీ బోర్డు చైర్మన్ మహేశ్ తన్నీరు మాట్లాడుతూ.. డాలస్ సభకు వస్తున్నవారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

లోకం పోకడ





ఆ పిల్లల ఏడుపులు, సతాయింపులకు బుజ్జగించలేక చచ్చిపోయాం.. ఇప్పుడు ప్రశాంతంగా ఉంది గురూ!

### వానా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 39.7°c | 24.7°c |
| నల్లగొండ | 37.0°c | 24.0°c |
| మెదక్ | 35.9°c | 23.2°c |
| వరంగల్ | 35.0°c | 26.0°c |
| రంగారెడ్డి | 33.3°c | 21.8°c |
| ఖమ్మం | 33.0°c | 26.0°c |
| నిజామాబాద్ | 30.3°c | 24.3°c |
| కరీంనగర్ | 32.0°c | 27.0°c |
| హైదరాబాద్ | 31.0°c | 23.8°c |
| మహబూబ్‌నగర్ | 30.0°c | 24.0°c |

## బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్ అరెస్ట్

- అర్ధరాత్రి అరెస్ట్ చేసిన హైదరాబాద్ పోలీసులు
- అప్రమత్తమైన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్
- బీఆర్‌ఎస్ పార్టీ లీగల్ టీంతో కోర్టుకు
- లీగల్ సెల్ వాదనలతో బెయిల్ మంజూరు



మంథని రూరల్/ పెద్దపల్లి( నమస్తే తెలంగాణ) మే 29: బీఆర్‌ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ సర్కార్ నిర్బంధం కొనసాగుతున్నది. ప్రభుత్వ విధానాలు, పాలనలో లోపాలపై సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నిస్తున్న సోషల్‌మీడియా వారియర్లపై కేసులు పెట్టిస్తూ నిర్బంధిస్తున్నది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఖానాపూర్‌కు చెందిన సోషల్ మీడియా వారియర్ జక్కు శ్రావణ్‌కుమార్ ఇటీవల కాళేశ్వరంలో జరిగిన సరస్వతీ పుష్కరాలు, అందాల పోటీల నిర్వహణపై లోపాలు, పలు అంశాలను పేర్కొంటూ సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. దీంతో శ్రావణ్‌కుమార్‌పై మంగళవారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గారెపల్లికి చెందిన టీపీసీసీ మహిళావిభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఆంగోతు సుగుణ కాటారం ఠాణాలో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన టీపీసీసీ సోషల్ మీడియా కార్యదర్శి కైలాస్ సజ్జన్ సైతం హైదరాబాద్‌లో సైబర్ క్రైం సీసీఎస్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన హైదరాబాద్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి ఖానాపూర్‌కు వచ్చి శ్రావణ్‌కుమార్‌ను అరెస్టుచేసి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ హుటాహుటిన హైదరాబాద్ వెళ్లి బీఆర్‌ఎస్ లీగల్ టీంను కలిసి బెయిల్ కోసం కృషిచేశారు. శ్రావణ్ కుమార్‌ను పోలీసులు నాంపల్లి కోర్టులో హాజరు పరుచగా, బీఆర్‌ఎస్ లీగల్ సెల్ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది.

## బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు

- రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలన
- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తారా?
- పోలీసు నిర్బంధాలకు భయపడేదిలేదు
- ముప్కాల్ స్టేషన్‌ను ముట్టడించిన పార్టీశ్రేణులు

ముప్కాల్, మే 29: అటు రాష్ట్రంలో ఇటు బాల్కొండ నియోజకవర్గంలో అరాచక, నియంత పాలన కొనసాగుతున్నదని బీఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జోగు నర్సయ్య ఇటీవల కాంగ్రెస్ ఇచ్చిన హామీలతోపాటు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి అక్రమాలపై సోషల్‌మీడియా వేదికగా ప్రశ్నించారు. దీంతో నర్సయ్యకు పోలీసులు నోటీసులు జారీచేశారు. దీనిని నిరసిస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులు గురువారం ముప్కాల్ పోలీసుస్టేషన్ ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని మండిపడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి చేస్తున్న అక్రమాలను ఎత్తి చూపుతున్న జోగు నర్సయ్యపై కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రశ్నించినవారిపై అకారణంగా కేసులు పెడుతూ పోలీసుస్టేషన్‌కు ఎందుకు పిలిపిస్తున్నారని ఎస్సైని అడిగితే.. కేసు పెట్టిన వాళ్లను అడిగి చెబుతామని సమాధానం ఇస్తున్నారని పేర్కొన్నారు. గతంలో సునీల్‌రెడ్డి.. మాజీ మంత్రి వేములతోపాటు ఆయన కుటుంబంపై నిరాధార ఆరోపణలు చేసినా తాము ఇలా వ్యవహరించలేదని గుర్తుచేశారు. బాల్కొండ నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రూ.వందల కోట్లు సంపాదిస్తున్నారని ఆరోపించారు.

## తెలంగాణపై బాబు కన్నేశారు!

- కేసీఆర్‌పై రివేంజ్ కోసం దొడ్డిదారిన రేవంత్‌రెడ్డి, బీజేపీ ద్వారా పాగా వేసే ఎత్తుగడ
- జల వనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్ ఫైర్



హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సంపదపై కన్నేసిన ఏపీ సీఎం చంద్రబాబు మళ్లీ రాష్ట్రానికి రావాలని ప్లాన్ చేస్తున్నారని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్ విమర్శించారు. కేసీఆర్ చేతిలో పరాభవం పొందిన చంద్రబాబు డొంక తిరుగుడుగా రేవంత్‌రెడ్డి, బీజేపీ ద్వారా తెలంగాణలో పాగా వేసి రివేంజ్ తీర్చుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. అందులో భాగంగా తెలంగాణను అభివృద్ధి చేశానని, కాళేశ్వరం నిర్మాణాన్ని అడ్డుకోలేదని అబద్ధాలు చెప్తున్నారని ధ్వజమెత్తారు. గురువారం 'టీ న్యూస్'తో ప్రకాశ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబుకు అసలు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రం ఏర్పడేనాటికి తెలంగాణ తలసరి ఆదాయం రూ. 97 వేలు ఉంటే దానిని కేసీఆర్ 3.5 లక్షలకు పెంచారని, 62 ఏండ్ల సమైక్య పాలకుల ఏలుబడిలో రూ. 62 వేల కోట్ల రాష్ట్ర వార్షిక బడ్జెట్ ఉంటే, తెలంగాణలో కేసీఆర్ దానిని రూ.2.2 లక్షల కోట్లకు పెంచారని గుర్తుచేశారు. సమైక్య రాష్ట్రంలో ట్యాక్స్ రెవెన్యూ రూ. 29 వేల కోట్లు ఉంటే, కేసీఆర్ దానిని రూ.1.12 లక్షల కోట్లకు పెంచారని, ఇదంతా కేసీఆర్ తొమ్మిదేండ్ల కష్టార్జితంతో సాధ్యమైందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధిని తన ఖాతాలో వేసుకోవాలనే ఉద్దేశం వెనుక కుట్రకోణాలు ఉన్నాయని ఆరోపించారు.

### రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి పంపింది బాబే

రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి పంపించింది, ఆయనకు పీసీసీ చీఫ్ ఇప్పించింది చంద్రబాబేనని పేర్కొన్నారు. కాళేశ్వరం నిర్మించే సమయంలో అనుమతులు ఇవ్వొద్దంటూ సీడబ్ల్యూసీకి చంద్రబాబు లేఖలు రాశారని ఆరోపించారు. మేడిగడ్డ ప్రాజెక్టుతో ఏపీలోని గోదావరి డెల్టా ప్రాంతాలకు నీరందక పంటలు ఎండిపోయినట్టు వార్తలు వచ్చాయని, మేడిగడ్డ దెబ్బతినడానికి, చంద్రబాబుకు సంబంధం ఉన్నదేమోనని వీ ప్రకాశ్ అనుమానం వ్యక్తంచేశారు.




ఉన్నత విద్యామండలి ఆఫీస్ ఎదుట ధర్నాలో పాల్గొన్న బీఆర్‌ఎస్వీ నాయకులు

## ఇంజినీరింగ్ ఫీజులు పెంచొద్దు

- బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్
- ఉన్నత విద్యామండలి ఆఫీస్ ఎదుట బీఆర్‌ఎస్వీ ధర్నా

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫీజులు పెంచాలనే ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. బీ క్యాటగిరీ సీట్లను ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారానే భర్తీచేయాలని, డొనేషన్లు తీసుకొనే కళాశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి బోర్డు కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బోర్డు చైర్మన్ బాలకిష్టారెడ్డికి అందజేశారు. అనంతరం గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. ఫీజుల పెంపునకు తెలంగాణ అడ్మిషన్, ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) ప్రతిపాదించిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాలేజీలు ఫీజులు పెంచుతుంటే, ప్రభుత్వం మాత్రం రీయింబర్స్‌మెంట్ పెంచకుండా విద్యార్థుల కుటుంబాలను అప్పుల్లోకి నెడుతున్నదని విమర్శించారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు , నేతలు కోతి విజయ్, చటారి దశరథ్, యశ్వంత్‌కుమార్, కాటం శివ, రమేశ్‌గౌడ్, హరిబాబు, జంగయ్య, మాజ్, నర్సింగ్, ప్రశాంత్, నాగరాజు, షేర్‌రమన్, పీవీగౌడ్, శ్రీకాంత్ ముదిరాజ్, నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.



ఫార్మాసిటీ రైతులకు న్యాయం చేయాలంటూ కలెక్టర్‌కు వినిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## ..రద్దుచేస్తే భూములను రైతులకివ్వాలి

మొదటిపేజీ తరువాయి...

వెంటనే ఆ భూములను తిరిగి రైతులకే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, మల్‌రెడ్డి రంగారెడ్డి ఫార్మా అనుబంధ గ్రామాల్లో పర్యటించి తమ పార్టీని గెలిపిస్తే ఫార్మాసిటీని రద్దుచేసి ఆ భూములను తిరిగి రైతులకే ఇస్తామని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తడంలేదని మండిపడ్డారు.

### బాధిత రైతులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం 14 వేల ఎకరాల్లో భూసేకరణ చేపట్టిందని, ఈ భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు ఒక గుంటచొప్పున ఇండ్ల స్థలాలు కేటాయించిందని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. సుమారు 500 ఎకరాల్లో లేఅవుట్‌ను ఏర్పాటుచేసి బాధిత రైతులకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే పట్టాలు ఇచ్చామని చెప్పారు. పట్టాలు పొందిన రైతులకు ఇండ్ల స్థలాలు చూపించాల్సి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నా కూడా పట్టాలు పొందినవారికి ఇండ్లస్థలాలు చూపించటంలేదని విమర్శించారు. గత సంక్రాంతి పండుగలోపే పట్టాలు పొందిన రైతులందరికి ప్రభుత్వ ఖర్చుతోనే రిజిస్ట్రేషన్లు చేయిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు వారికి ఇండ్ల స్థలాలు కేటాయించలేదని అన్నారు. 15 రోజుల్లో పట్టాలు పొందిన రైతులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని, లేనిపక్షంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### నిషేధిత జాబితాలో నుంచి రైతుల పేర్లను తొలగించాలి

ఫార్మాసిటీ ఏర్పాటుకోసం ప్రభుత్వం సేకరించిన భూమి కాకుండా అదనంగా మరో రెండువేల ఎకరాల పట్టా భూములను ప్రభుత్వం రైతులకు తెలియకుండానే వారిపేర్లను నిషేధిత జాబితాలో చేర్పించిందని సబితారెడ్డి అన్నారు. వారి భూములకు ఇష్టానుసారంగా పరిహారాన్ని ప్రకటించిందని, ఆ పరిహారం కూడా కోర్టులో జమచేశారని పేర్కొన్నారు. పట్టా భూములివ్వటానికి రైతులు ఒప్పుకోనందున ఆ భూములను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## అంచనాలెందుకు పెంచారు?

మొదటిపేజీ తరువాయి...

ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుపై ప్రభుత్వానికి ఒక విధానం ఉందా? అని మండిపడ్డారు. ఒక్కొక్క స్కూల్‌కు రూ.80 కోట్లు ఖర్చు చేస్తామని ముందుగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు రూ.200 కోట్లకు ఎందుకు పెంచారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటులో రేవంత్‌రెడ్డివి మాటల కోతలే తప్ప.. చేతలు లేవని, సర్కారుకే స్పష్టతలేదని ఎద్దేవా చేశారు. స్కూళ్ల నిర్మాణ బాధ్యతలు వేరే రాష్ట్రానికి చెందిన ఏజెన్సీకి ఇవ్వాలని కుట్రలు జరుగుతున్నాయని, నిర్మాణ ఏజెన్సీలు తెలంగాణ రాష్ట్రంలో లేవా? అని ప్రశ్నించారు.

### గురుకులాల్లో దారుణ పరిస్థితులు

తెలంగాణలో పేద, బడుగుబలహీన వర్గాల కోసం కేసీఆర్ ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలల్లో పరిస్థితులు కాంగ్రెస్ ప్రభుత్వంలో దారుణంగా మారాయని సబితాఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రైవేశపెట్టిన 'మన ఊరు-మనబడి' పథకం ఈ ప్రభుత్వానికి ఎందుకు నచ్చడంలేదో అర్థంకావడంలేదని అన్నారు. కేసీఆర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను నిందించడం, విమర్శించడంతప్ప సీఎం రేవంత్‌రెడ్డికి వేరే ఏ పనీ చేతకావడంలేదని నిప్పులుచెరిగారు. కేసీఆర్ వల్లే గురుకులాల్లో నాణ్యమైన విద్య లభిస్తున్నదని, ఆ విషయం హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యయనంలో కూడా వెల్లడైందని పేర్కొన్నారు. తెలంగాణలో కుల వృత్తులను కేసీఆర్ కాపాడారని, గురుకులాల్లో చదువుతున్నది కులవృత్తులపై ఆధారపడ్డవాళ్ల పిల్లలే కదా అని చెప్పారు. అలాంటి గురుకులాలను కాదని, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు పెట్టి, వాటిలో ఎవరికి ప్రవేశాలు కల్పిస్తారో స్పష్టత ఇవ్వాలని, ప్రభుత్వ పెద్దలు పూటకోమాట మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

### టాయిలెట్లు కడిగిస్తే తప్పులేదంటారా!

విద్యార్థులతో టాయిలెట్లు కడిగిస్తే తప్పేంటని గురుకులాల ఉన్నతాధికారి మాట్లాడడం ఎంతవరకు సమంజసమని సబితాఇంద్రారెడ్డి మండిపడ్డారు. విద్యార్థులకు ప్రభుత్వం సరైన వసతులు కల్పించకుండా పనులు చేయించడమేంటని, ఇలాంటి పనులు చదువులపై ప్రభావం చూపవా? అని ప్రశ్నించారు. గురుకులాల్లో మౌలిక సదుపాయాల నిర్వహణకు నిధులను ఎందుకు తగ్గిస్తున్నారని నిలదీశారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల కోసం రూ.20,000 కోట్లు కేటాయిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.2,000 కోట్లను కూడా విడుదల చేయలేదని చెప్పారు. కేసీఆర్ హయాంలో ప్రభుత్వ స్కూళ్లు మూతపడ్డాయంటూ అసత్యపు ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిలో ఎన్ని తెరిపించారో లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు సంబంధించిన రూ.8,000 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని సబితాఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

### అంచనాలు చూస్తే భయమేస్తున్నది: వాణీదేవి



విద్యావ్యవస్థకు ప్రభుత్వం ఎంత చేసినా తక్కువే అవుతుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తెలిపారు. కానీ ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల అంచనాలు చూస్తే భయమేస్తున్నదని చెప్పారు. స్కూళ్లు ఏర్పాటు చేస్తే సరిపోదని, మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల నియామకంపైనా సర్కారు దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మండల, జిల్లా పరిషత్తు స్కూళ్ల పరిస్థితి దారుణంగా ఉందని, ఆ శాఖ సీఎం వద్దే ఉన్నా.. విద్యా వ్యవస్థలపై సమీక్షలు కూడా చేయడంలేదని విమర్శించారు.